




ప్రతి ఫొటో వెనుక.. ఒక కథ ఉంటుంది.
ఒక ఎమోషన్ (భావోద్వేగం) ఉంటుంది.
ఆ భావోద్వేగాలనే ఫొటోలుగా మలిస్తే..
'ఎమోటివ్ ఎక్స్‌ప్రెషన్స్'
ఫొటోగ్రఫీ (Emotive
Expressions) అవుతుంది.

# భావోద్వేగాలను బంధిద్దాం!



ఒక చిరునవ్వు, ఓ కన్నీటి చుక్క, ఆశ్చర్యం, ప్రేమ.. ఇలాంటి ఎక్స్‌ప్రెషన్స్ చూపించే ముఖాలు ఫొటోను ఎంతో బలమైన దృశ్యంగా మార్చేస్తాయి. ఇలాంటి ప్రత్యేకమైన ఫొటోలు మొబైల్ ఫోన్ సహాయంతోనూ అత్యద్భుతంగా క్యాప్చర్ చేయొచ్చు. అందుకు కావాల్సింది.. కేవలం సమయం కోసం వేచి ఉండటమే!

**ఎమోటివ్ ఎక్స్‌ప్రెషన్స్ అంటే..**

వ్యక్తులు చూపించే సహజమైన భావోద్వేగాలే.. ఎమోటివ్ ఎక్స్‌ప్రెషన్స్! మనిషి సంతోషంలో నవ్వుతున్నా.. బాధలో ఏడుస్తున్నా.. ఆశ్చర్యంలో మునిగిపోయినా.. ప్రేమగా చూస్తున్నా.. భయంతో కంపించిపోతున్నా.. అతని కళ్లలో, ముఖంలో, శరీర భాషలో అందుకు సంబంధించిన భావోద్వేగాలు పలుకుతుంటాయి. వాటిని బంధించడమే.. ఎమోటివ్ ఎక్స్‌ప్రెషన్స్ ఫొటోగ్రఫీ! ఈ ఫొటోలు.. తమకే సొంతమైన కథలను చెబుతాయి. సజీవంగా, సహజత్వంగా ఉండి.. వీక్షకుల్లో స్పందనను కలిగిస్తాయి.

**కావాల్సినవి**

- మంచి కెమెరా ఉండే స్మార్ట్‌ఫోన్.
- సహజమైన వెలుతురు, సాఫ్ట్ లైటింగ్.
- ఓపిక, ఎదుటివారిలో భావోద్వేగాలను గుర్తించే గుణం.
- మంచి టైమింగ్.

**సెట్టింగ్స్ (సాధారణంగా)**

- **ఫోకస్ :** సబ్జెక్ట్ ముఖంపై క్లియర్ ఫోకస్ పెట్టండి.
- **ఎక్స్‌పోజర్ :** అవసరమైనంత మేర ప్రకాశవంతంగా ఉండాలి.
- **పోట్రెయిట్ మోడ్ :** ఆన్ చేస్తే.. ముఖం మరింత హైలైట్ అవుతుంది.
- **హెచ్‌డీఆర్ మోడ్ :** ఎక్కువ డిటెయిల్స్‌ను క్యాప్చర్ చేయడానికి ఉపయోగపడుతుంది.
- **ఫ్లాష్ :** సాధ్యమైనంత వరకూ ఆఫ్ చేస్తేనే మంచిది. సహజత్వం దెబ్బతినకుండా ఉంటుంది.


**ఎడిటింగ్ కోసం..**

- స్నాప్‌సీడ్ (Snapseed) : ముఖంలో రంగులు, మెరుపు, డిటెయిల్స్ మెరుగుపరిచేందుకు.
- **లైట్ రూం మొబైల్ :** నాచురల్ టోన్ ట్యూనింగ్ కోసం
- **పిక్స్ ఆర్ట్:** స్పెషల్ ఎఫెక్ట్స్, ఫిల్టర్స్ కోసం.

**టిప్స్ :**

1. సహజత్వంపై దృష్టిపెట్టండి. ప్రాకృతిక విషయాల మీద పట్టు సాధించండి. అప్పుడే.. సహజమైన ఎమోషన్స్ పండుతాయి. వాటిని క్యాప్చర్ చేయడానికి ట్రై చేయండి.
2. మోడల్‌కు అనుకూలంగా ఉండే వాతావరణం కల్పించండి. పోజులు కాకుండా..
3. కళ్లలోని భావాలను క్యాప్చర్ చేయండి. కళ్లే.. ఆ ఫొటో వెనుక కథను చెబుతాయి.
4. లైటింగ్ సాఫ్ట్‌గా ఉండేలా చూసుకోండి. హార్ష్ లైటింగ్.. మనిషిలోని భావోద్వేగాలను మార్చేస్తుంది.
5. ఈ ఫొటోగ్రఫీలో టైమింగ్ ముఖ్యం. నిజమైన చిరునవ్వు వచ్చేవరకూ వేచి ఉండండి. ఎక్స్‌ప్రెషన్ పండిన వెంటనే.. క్లిక్ మనిపించండి.







**క్రియేటివ్ ఐడియాస్**

- ఆడుకుంటున్న పిల్లల్లో ఆనందపు ఎక్స్‌ప్రెషన్స్ అద్భుతంగా వస్తాయి.
- వృద్ధుల ముఖంలో జీవిత అనుభవాలు కనిపిస్తాయి.
- జాలీగా ఉండే స్నేహితుల మధ్య ఉత్సాహకరమైన క్షణాలు..
- ఒంటరిగా, దీర్ఘాలోచనలో ఉన్న మనిషిలోని భావోద్వేగాలను బంధించండి
- ఎవరినైనా సర్‌ప్రైజ్ చేసినప్పుడు.. వారి ముఖంలో కనిపించే ఆశ్చర్యాన్ని క్యాప్చర్ చేయండి.

**ఎడిటింగ్ టిప్స్**

- బ్రైట్‌నెస్, కాంట్రాస్ట్‌ను కొద్దిగా తగ్గించండి.
- ముఖం సహజంగా కనిపించడానికి కలర్ టెంపరేచర్‌ను మార్చండి.
- ఫిల్టర్స్‌ను ఎక్కువగా ఉపయోగిస్తే.. ఫొటోల్లో సహజత్వం దెబ్బతింటుంది.
- ముఖంలో డిటెయిల్స్ (కళ్లలో షార్ప్‌నెస్, ఎక్స్‌ప్రెషన్స్) పోకుండా చూసుకోండి.

**.. చివరిగా ఎమోటివ్ ఎక్స్‌ప్రెషన్స్ ఫొటోగ్రఫీ అనేది ఫొటోల్లోని కథను చెప్పే కళ . మీ రోజువారీ జీవితంలో గుర్తించే ఒక్కో ఎక్స్‌ప్రెషన్‌ను ఫొటోగా మారిస్తే.. ఆ ఒక్కో ఫొటో ఒక్కో కథ అవుతుంది. మొబైల్ ఫోన్‌తోనూ గొప్పగొప్ప భావోద్వేగాలను సజీవంగా బంధించవచ్చు. ఈరోజే ప్రయత్నించండి. సంతోషంతో నవ్వుతున్న మీ స్నేహితులను, పిల్లల, పెద్దల భావోద్వేగాలను క్యాప్చర్ చేయండి. హ్యాపీ క్లిక్కింగ్!**

... ఆడెపు హరికృష్ణ